క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి

ఏఓ రాజ్యలక్ష్మి



విస్సన్నపేట: మండలంలో విత్తన డీలర్లు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని ఏఓ రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక విత్తనాలు విక్రయ దుకాణాలను సోమవారం ఏఓ తనిఖీ చేశారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు దుకాణాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన విత్తనాల నిల్వలను, కంపెనీల వివరాలు, కొనుగోలు బిల్లులను పరిశీలించారు. వరి, పత్తి, ఇతర విత్తనాల నాణ్యత పరీక్షించేందుకు నమూనాలను సేకరించి విత్తన పరీక్ష కేంద్రానికి పంపారు.

మట్టిలోడు ట్రాక్టర్లు స్వాధీనం



తిరువూరు: అనుమతి లేకుండా చెరువు మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న ప్రాంతంలో ట్రాక్టర్లను తిరువూరు తహసీల్దారు సురేష్ బాబు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వాల్టా నిబంధనలకు విరుద్ధంగా మట్టి తోలకాలు జరుపుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు దాడి నిర్వహించారు. మూడు ట్రాక్టర్లను స్వాధీనపరచుకుని పోలీసులకు అప్పగించారు.

ఉత్సాహంగా మన గ్రామం-మన శుభ్రత



చాట్రాయి: మాదిగ కమ్యూనిటీ ట్రస్టు ఆధ్వర్యంలో మన గ్రామం-మన శుభ్రత కార్యక్రమాలు రెండో రోజున చేపట్టారు. మండలంలోని కోటపాడు గ్రామంలో సోమవారం మాదిగ కమ్యూనిటీ ట్రస్టు ఆధ్వర్యంలో యువతీ యువకులు పరిశుభ్రత కార్యక్రమాలు చేశారు. ట్రస్టు అధ్యక్షుడు అబ్బిదాసరి రవీంద్ర ఆధ్వర్యంలో అన్ని కాలనీల్లో మురుగు నీరు, పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కంచర్ల సిద్దయ్య, కార్యదర్శి మోనూరి మురళి, సహాయ కార్యదర్శి గొల్లమండల వెంకటేశ్వరావు, కోశాధికారి అబ్బిదాసరి కాంతారావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నూజివీడు కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

మైలవరం: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ కనీసం ఓ మొక్కనైనా నాటాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరూ అంకిత భావంతో మొక్కల సంరక్షణ చేపట్టాలన్నారు. కాలుష్య కారక వస్తువులు వాడకాన్ని విడిచిపెట్టి, చెట్లను విరివిగా పెంచి పుడమి తల్లిని రక్షించాలన్నారు. సమస్త ప్రాణికోటికి జీవనాధారమైన పర్యావరణ సమతుల్యతకు సహకరించాలన్నారు. ప్రకృతిని నందనవనం చేయాలని, భవిష్యత్ తరాలకు వారసత్వ సంపదగా ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని అందించాలన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వృక్ష సంపద పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుందని కొండపల్లి పీహెచ్‌సీ వైద్యులు ఆర్.పద్మావతి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 17 వరకు జరిగే ఐడీసీఎఫ్ (ఇంటెన్సివ్ వైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్‌నైట్) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటింటి సర్వేతో 5 ఏళ్ల లోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. ఇంటివద్దనే ఓఆర్ఎస్ తయారు చేసుకునే విధానం వివరించాలన్నారు. పిల్లలకు డయేరియా సోకితే 14రోజులు జింక్ మాత్రలు వాడాలన్నారు. డాక్టర్ శిరీషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జూపూడి(ఇబ్రహీంపట్నం): పర్యావరణ పరిరక్షణ ప్రతి వ్యక్తి జీవితంలో ఒక భాగం కావాలని నిమ్రా కళాశాల అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నివారణపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. విద్యుత్, నీరు పొదుపుగా వాడాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి మొక్కలు విరివిగా పెంచాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు సెమినార్‌లు, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2023 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు మిషన్ లైఫ్ కాన్సెప్ట్‌లో భాగంగా మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ప్రకృతి క్లబ్, జాతీయ సేవా విభాగం, ఎన్‌సీసీ సంయుక్తంగా కళాశాలను పర్యావరణ పరిరక్షణ ప్లాస్టిక్ రహిత ప్రాంగణంగా ఉంచడానికి విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. క్యాంటీన్, బాలుర, బాలికల వసతి గృహాల్లో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ క్యాంటీన్‌లో కాఫీ, టీలకు మట్టి, స్టీల్, సిరామిక్ పాత్రలను వాడాలని, రసాయన పానీయాలకు బదులు పళ్ళ రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వినియోగించాలన్నారు. ప్రకృతి క్లబ్ ప్రతినిధులు, డాక్టర్ షహీదా నీలోఫర్, డాక్టర్ భాగ్యలక్ష్మి, జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ శివహరిప్రసాద్, ఎన్‌సీసీ ఇన్‌చార్జి ఆర్.పవిత్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని తిరువూరు 4వ సచివాలయంలో సోమవారం నిర్వహించారు. పర్యావరణ సమతుల్యత కాపాడతామని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. 9వ వార్డు కౌన్సిలర్ దుర్గారావు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీ వాడపల్లి రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



నూజివీడులో మొక్క నాటుతున్న సబ్‌కలెక్టర్ అదర్శ్ రాజేంద్రన్, డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్



మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నూజివీడు: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని నూజివీడు సబ్ కలెక్టర్ అదర్శ్ రాజేంద్రన్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నేపథ్యంలో నూజివీడు పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి గుర్రంగేటు వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణానికి హాని కలిగించే కాలుష్య కారకాలను విడుదల చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, నార, నూలుతో తయారు చేసిన సంచులనే వాడాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్, డీఎస్పీ మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, టౌన్ సీఐ ఎంవీవీఎస్ఎన్‌మూర్తి, త్రివిధ శ్రీనివాస్, కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పీజీ కేంద్రంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ప్రిన్సిపాల్ ఆచార్య వీ వెంకట రాము మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితంగా ప్రతి ఒక్కరూ జీవనం సాగించాలన్నారు. మండలంలోని దిగవల్లిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి బీ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో షేక్ దావల్‌బీ, ఎంపీహెచ్‌వో అర్జున్‌రావు పాల్గొన్నారు.



కొండపల్లి అవగాహన ర్యాలీలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలి

నూజివీడు: భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం అన్నారు. పట్టణంలోని కోర్టు భవనాల ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించుకోవడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో వాతావరణంలోకి కాలుష్య కారకాలను అదుపు లేకుండా విడుదల చేస్తున్నారని, దీని వల్ల ఆక్సిజన్ శాతం తగ్గిపోయి, కార్బన్‌డైఆక్సైడ్ శాతం పెరిగిపోయి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి మడుపల్లి మధు రవిశంకర్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో మూడు బాలికల జూనియర్ కాలేజీలు

- ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు
- ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: మైలవరం నియోజకవర్గంలో మూడు బాలికల జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌మీడియెట్‌లో విద్యార్థినుల డ్రాపౌట్స్ తగ్గించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. దీనిలో భాగంగానే బాలికల జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేశామని, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి జెడ్పీ బాలికల హైస్కూల్, జీ.కొండూరు మండలం వెలగలేరులోని జెడ్పీ హైస్కూల్, మైలవరంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది 2023-24 విద్యా సంవత్సరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జూనియర్ కళాశాలు ప్రారంభించినట్లు తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఇంటర్ విద్యను ప్రక్షాళన చేసినట్లు తెలిపారు. బాలికల తల్లిదండ్రులు బాలికలను ప్రోత్సహించి, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గానికి మూడు జూనియర్ బాలికల కళాశాలలు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

గౌరవప్రదమైన జీవనం సాగించాలి

సారా కేసుల్లో నిందితులకు డీఎస్ఈవో సత్తిబాబు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహించిన ఎస్పీ సత్తిబాబు

మైలవరం: సారా కేసుల్లో పాత నిందితులు సమాజంలో గౌరవంగా బతికేందుకు జీవన ప్రత్యామ్నాయంగా వివిధ వ్యాపారాలు నిర్వహించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా డీఎస్ఈఓ ఎం.సత్తిబాబు తెలిపారు. మైలవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ కార్యాలయంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో విజయవాడ డీఐజీ ఆదేశాల మేరకు డీఎస్ఈఓ సత్తిబాబు ఆధ్వర్యంలో మైలవరం, తిరువూరు ఎస్ఈబీ స్టేషన్స్ పరిధిలోని సాటు సారాయి కేసులలో పాత నిందితులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రుణాలు మంజూరుకు పేర్లను డీఎస్ఈఓ సత్తిబాబు నమోదు చేసుకున్నారు. మైలవరం, తిరువూరు ఎస్ఈబీ స్టేషన్స్ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది, మైల వరం సీఐ గిరిజా సత్యకుమారి పాల్గొన్నారు.

ఆయాల సమస్యలు పరిష్కరించాలి

రెడ్డిగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయాల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మార్పకట్ల త్యాగరాజు మాట్లాడుతూ మే, జూన్ నెలల్లో పనిచేస్తున్న ఆయాలకు పూర్తి జీతాన్ని ఇవ్వాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మండల ఎంఈఓ పీ రఘురాంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మరియమ్మ, ఎం.ఏసమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.





స్పందన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలి



నూజివీడులో స్పందన అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ అదర్శ్ రాజేంద్రన్



గంపలగూడెంలో స్పందన కార్యక్రమంలో అర్జీ తీసుకుంటున్న అధికారులు

నూజివీడు: స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ అదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనలో 15 అర్జీలు రాగా పరిష్కారం నిమిత్తం వాటిని సంబంధిత అధికారులకు పంపారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పరిష్కార నివేదికకు లబ్ధిదారుల సమన్వయంకు సంబంధించిన ఫొటోలను జత చేయాలని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. సదరం సర్టిఫికెట్ కావాలని, ఆక్రమణలను తొలగించాలని, పట్టాదారుపాసు పుస్తకాలు ఇవ్వాలని, భూ వివాదాలపైన, ప్రభుత్వ ఆస్తి ఆక్రమణ, కుటుంబ గొడవలు, రెవెన్యూ రికార్డుల్లో వివరాల నమోదు తదితర వాటిపై అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఏడీఏ విద్యాసాగర్, సీడీపీవో సూరాణి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, ఆర్ అండ్‌బీ డీఈ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో నాలుగు అర్జీలను అధికారులు స్వీకరించారు. వివరాలను ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఊటుకూరుకు చెందిన మేరుగు స్వరూప కొత్తగా గృహం నిర్మించేందుకు అడ్డంగా ఉన్న కరెంటు స్తంభం తొలగించాలని దరఖాస్తు చేశారు. తోటమూల పేదరాశి కుంటలో ఆక్రమణలు తొలగించి సరిహద్దులు ఏర్పాటు చేసి సాగునీటి సమస్య పరిష్కరించాలని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు కోట దాను కోరారు. వినగడప శివారు పేరంటాళ్ల గుట్ట వద్ద లక్ష్మీస్టోన్ క్రషర్స్ వారు బ్లాస్టింగ్ చేయటంతో నివాస గృహాలుదెబ్బతింటున్నాయని, చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో కార్యదర్శి గువ్వల సీతామిరెడ్డి దరఖాస్తు ఇచ్చారు. తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి, ఏఓ, సాయిశ్రీ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థి ప్రతిభ



కాంస్య పతకం సాధించిన రాజశేఖర్

ఇబ్రహీంపట్నం:ఢిల్లీలోని గౌతమ్ బుద్ధ యూనివర్సిటీలో ఈనెల మే 28 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి ఖేల్ ఇండియా అంతర యూనివర్సిటీ క్రీడా పోటీల్లో జాకీర్ హుస్సేన్ కళాశాల బీకాం విద్యార్థి బి.రాజశేఖర్ కాంస్య పతకం సాధించాడు. కృష్ణా యూనివర్సిటీ టీమ్ తరపున రాజశేఖర్ వెయిట్ లిఫ్టింగ్ 109 కేజీల కేటగిరీలో తలపడి స్నాచ్‌లో 121కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 165 కేజీలు మొత్తం 286 కేజీల బరువు ఎత్తి తృతీయ స్థానంలో కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.మహబూషా సోమవారం తెలిపారు. పీడీ అమీద్‌ఖాన్, ఎన్ఎస్ఎస్ అధికారులు మస్తాన్‌వలి, జాఫర్‌సాధిక్, నాగుల్ మీరా హర్షం వ్యక్తం చేశారు.


గ్రంథాలయాల్లో కొనసాగుతున్న వేసవి శిక్షణ

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురించి అవగాహన కల్పించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈమని శేషయ్య, వంగల గోవిందరావు మాట్లాడుతూ విచ్చలవిడిగా చెట్లను నరికివేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిరోధించాలన్నారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నీతి కథల బోధన

రెడ్డిగూడెం: స్థానిక గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు ఇందిరాగాంధీ జీవిత చరిత్ర వివరించారు. విద్యార్థులకు నీతి కథలు, పుస్తకాలు చదివించి, చెప్పించారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ మణి రత్నం, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల బడిబాట



గానుగపాడులో కరపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

తిరువూరు: కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న తరుణంలో గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం విద్యకు చేస్తున్న ఖర్చు, ఇస్తున్న ప్రాధాన్యత వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. తిరువూరు పట్టణంలోని సుగాలీకాలనీ, ఇందిరా కాలనీ, తంగిళ్లబీడు, మండలంలోని రోలుపడి, గానుగపాడు, మునుకుళ్ల, కోకిలంపాడు, మల్లేల, కాకర్ల, అక్కపాలెం, వావిలాల, ఎర్రమాడు తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

దోనపాడు(పెదపారుపూడి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మండలంలోని దోనపాడు గ్రామంలో ఆదివారం రాత్రి కోడి పందేల శిబిరంపై దాడులు చేశారు. ఈ దాడిలో 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.6,800, రెండు కోడి పుంజులు, 14 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పల్లా నాగకల్యాణి తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పెన్షనర్ల పాతబకాయిలను విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు వంగల గోవిందరావు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం 11వ పీఆర్సీ కమిషన్‌ను వేయాలని, పాత బకాయిలను విడుదల చేయాలని ఏపీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నూజివీడు శాఖ అధ్యక్షుడు వంగల గోవిందరావు కోరారు. స్థానిక ఎన్‌జీవో భవనం ప్రాంగణంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షన్‌దారుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఇటీవల రైలు ప్రమాదంలో అమరులైన వారికి మౌనం పాటించి నివాళులర్పించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రజలందరూ కదలిరావాలన్నారు. కార్యదర్శి సోమయాజులు, నాయకులు ఈమని శేషయ్య, సక్కా లక్ష్మీనారాయణ, కోట శివ, సుబ్బారావు, తిరుపతిరావు, ఏ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

